క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బామిడి రాజు

కొత్తూరు: మండలంలోని ఓంద్రుజోల, గులివిందలపేట గ్రామాలకు చెందిన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఓంద్రుజోలకు చెందిన సామాజిక కార్యకర్త బామిడి రాజు గురువారం పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా స్వగ్రామంలోని పేదలకు సహాయం చేయాలన్న ఆలోచనతో నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు రాజు తెలిపారు. సంక్రాంతి రోజు గ్రామంలోని యువతకు పలు రకాల ఆటలు, డాన్స్‌లు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



తురకపేట సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎల్‌.ఎన్‌.పేట: రైతుల నుంచి వచ్చే అన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని తహసీలార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కరకవలస, తురకపేట గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను గురువారం పరిశీలించారు. రైతులు భూ సంబంధిత సమస్యలను ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకున్న వారం రోజుల్లోనే పరిష్కరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో జోగినాయుడు, పంచాయతీ కార్యదర్శి తవిటినాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్ శ్రీవాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సోనియా, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రేయ మిశ్రో నృత్య ప్రదర్శన



శ్రేయను సత్కరిస్తున్న రిటర్డ్ చీఫ్ ఇంజినీర్ సంపత్‌కుమార్

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలోని షిర్డీ గిరిపై ఉన్న షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగులు శ్రేయ మిశ్రా ప్రతిభ కనబరిచింది. శ్రేయ ప్లేటుపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి పలువురు ప్రశంసల వర్షం కురిపించారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ కొంచాడ సంపత్‌కుమార్ శ్రేయమిశ్రోను సత్కరించారు. బాబా మందిరం కమిటీ సభ్యుడు తారకేశ్వరరావు, తదతరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత కొండపోలవలస



కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సదగాన రవి, తదితరులు

నరసన్నపేట: మండలంలోని సుందరాపురంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు బుధ, గురువారాల్లో ఉమామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 22 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జలుమూరు మండలం కొండపోలవలసకు చెందిన జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ కొండపోలవలస-రెడ్డికిపేట మధ్య జరిగింది. నరసన్నపేట మండలం రెడ్డికిపేట జట్టు ద్వితీయ స్థానం, జలుమూరు మండలం కూర్మనాథపురం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు గ్రామస్తుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సదగాన రవి, తదితరులు బహుమతులు, నగదు అందించారు. ఇదే గ్రామంలో క్రికెట్ పోటీలు కూడా నిర్వహించారు. దీంట్లో జలుమూరు మండలం పర్లాం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ గొటివాడ-పర్లాం జట్ల మధ్య జరిగింది. పర్లాం జట్టు విజయం సాధించింది.

వీజేకే మూర్తి మృతి తీరనిలోటు

పోలాకి: గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు, అభ్యుదయవాది వి.జె.కె.మూర్తి అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ఎ భుక్త, బాదాన రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షపాతిగా వారి హక్కుల సాధన కోసం జరిగిన అనేక పోరాటాలకు మూర్తి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ల సత్యనారాయణ భావజాల వ్యాప్తికి ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం స్థాపించి సమకాలీన అంశాలపై ప్రజలను చైతన్యం చేశారన్నారు.

రైతుల చూపు.. ప్రకృతి వైపు



హిరమండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు

- లాభదాయకంగా ప్రకృతి వ్యవసాయం
- రసాయన ఎరువుల వాడకం నిల్
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చులు
- నాణ్యమైన ఉత్పత్తులు
- అంతర పంటలతో అధిక దిగుబడి

హిరమండలం: సాధారణ వ్యవసాయం నుంచి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపునకు మారి మంచి ఫలితాలు పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక పెట్టుబడులు పెట్టకుండా చీడపీడల నివారణకు పలు రకాల జీవామృతాలు వాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తున్నారు.

కొత్తూరు డివిజన్‌లో 11 యూనిట్లు..

కొత్తూరు డివిజన్‌లో కొత్తూరు, హిరమండలం, ఎల్‌.ఎన్‌.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో 11 ప్రకృత్యి వసాయ యూనిట్లు ఉన్నాయి. వీటి పరిధిలో 53 గ్రామ సంఘాలున్నాయి. సుమారు పది వేల మందికి పైగా రైతులు దాదాపు 9 వేల ఎకరాల వరకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

వివిధ రకాల పంట సాగు..

కొత్తూరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండిస్తున్నారు. వరి పంట 6,350 ఎకరాలు, కందిపంట 150, పసుపు 202, జీడిమామిడి 620, నువ్వు పంట 700, పెసర 200, మినుము 500, చిరుధాన్యాలు 150, కట్టిజనుము 200, మొక్కజొన్న 500 ఎకరాల్లో వేశారు. 130 ఎకరాల్లో చిక్కుడు, వంకాయ, టమాట, బీర, కాకర, సొరకాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు.

ఉత్పత్తులకు మేలైన ధర..

కష్టమే పెట్టుబడిగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెప్పే పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధిస్తూ అధిక ఆదాయం సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోందని రైతులు చెబుతున్నారు. వరి పంట దిగుబడి 35 బస్తాలు వస్తుండగా.. వాటికి మిగిలిన వరి ధాన్యం కన్నా ఎక్కువ ధర వస్తుందన్నారు.



ఘనజీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయిస్తున్న రైతులు

రసాయన రహితం..

పంట మొదలైనప్పటి నుంచి దుక్కిదున్నే సమయంలోనే ఘనజీవామృతం చల్లడం, పంటవేసే నారును భీజామృతంతో శుద్ధిచేయడం వంటివి చేస్తున్నారు. మొక్క ఎదుగుతున్న దశలో నీమాస్త్రం (వేపాకు, ఆవు పంచకం, ఆవు పేడతో కలిపిన) పిచికారీ చేయడం వంటివి చేస్తున్నారు. పూర్తిగా రసాయిన ఎరువుల వాడకం తగ్గిస్తున్నారు. దీని ద్వారా అధిక ఫలసాయం లభిస్తోందని రైతులు చెబుతున్నారు.

అంతర పంటలు..

మిర్చి పంట వేసిన రైతులు దానిలో అంతర పంటలుగా ముల్లంగి, జొన్న, సజ్జ, ఆవాలు, ఉల్లి, బంతి పూలు, పొద్దుతిరుగుడు వంటి వేస్తున్నారు. మరి కొంతమంది రైతులు పత్తిలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, బెండ, కాకార, బీర, దోసకాయ వంటి కూరగాయలు వేస్తూ అధిక దిగుబడితో పాటు లాభాలు సంపాదిస్తున్నారు.

ప్రకృతి వైపు ప్రోత్సాహం..

11 యూనిట్ల ద్వారా 53 గ్రామాల్లో 9 మంది యూనిట్ ఇన్‌చార్జిలతో పాటుగా ఐసీఆర్‌పీ (ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు) 43 మంది ఇద్దరు మోడల్ మేకర్లు, మాస్టర్ ట్రైనర్లు ఇద్దరు గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి ప్రకృతి వ్యవసాయం వైపు వారిని ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువులు వాడి చీడపీడలతో ఇబ్బంది పడుతున్న రైతులు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి ఘనజీవామృతం, భీజామృతం, నీమాస్త్రం వంటివి చీడపీడల నివారణ చేసే ప్రకృతి సిద్ధమైన వాటి తయారీ గురించి వివరిస్తున్నారు.

దిగుబడి బాగుంది



ఎకరా పొలంలో వరి పంట వేశాను. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు రసాయన ఎరువులు వాడకుండా ఘన, జీవామృతాలు చల్లుతున్నాను. మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడి బాగుంది.

– సారిపల్లి తిరుపతిరావు, రైతు, కొత్తూరు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



ప్రతి ఏటా ప్రకృతి వ్యవసాయం పంటలు వేస్తుంటాను. నాకున్న ఎకరం పొలంలో అంతర పంటలుగా 20 రకాలు వేశాను. మరికొందరు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాను. ఏటీఎం పద్ధతి (ఎనీటైం మనీ) ద్వారా దిగుబడి అంతరపంటల సాగుతో వస్తుంది. రైతు నష్టపోవడం ఉండదు.

– ఎస్‌.సూర్యనారాయణ, మాస్టర్ ట్రైనర్, కొత్తూరు మండలం

పొందూరు: 1994-95 పదో తరగతి బ్యాచ్



అపూర్వ సమ్మేళనం

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామంలో గల జెడ్పీ హైస్కూల్లో గురువారం 1994–95 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 30 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనంతో పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

రూ.50 వేల ఆర్థిక సాయం..

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తంతో హెచ్‌ఎంకు రివాల్వింగ్ చైర్, స్వర్ణోత్సవ కళా వేదికకు 30 కుర్చీలు, ఆడిటోరియానికి రంగులు వేసేందుకు ఖర్చు చేసినట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు. తామంతా చదువుకున్న పాఠశాలకు మరింత సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాలశెట్టి సాయికుమార్, మెట్ట అనంతభట్లు, పైడి హరిప్రసాద్, బాలకృష్ణ, కిశోర్‌బాబు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

కొత్తూరు: స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో 2001–2004లో చదివిన విద్యార్థులు కాలేజీ ఆవరణలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత కలవడంతో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. కాలేజీ కరస్పాండెంట్ సుధారాణి, ప్రన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులను సన్మానించారు.



కొత్తూరు: 2001-2004 డిగ్రీ బ్యాచ్

క్రికెట్ టోర్నీ విజేత కిలంతర

బూర్జ: మండలంలోని అల్లెన పంచాయతీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కిలంతర గ్రామానికి చెందిన టీమ్ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అల్లెన ఉమాబాలంకేశ్వర స్వామి క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో గురువారం పోటీలు నిర్వహించారు. ట్రోఫీ, బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రఘుమండ రాము, రవి, పెద్దింటి శ్రీనివాస్, రాజు, శ్రీరామ్, సురేష్, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రోఫీతో కిలంతర టీమ్

రోడ్డుపైకి మురుగునీరు



సారవకోట మండలంలోని వెంకటాపురం పంచాయతీ శివరాంపురం గ్రామంలోని మురుగు నీటి కాలువలు పూర్తిగా పాడయ్యాయి. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. పూడికలు తొలగించేందుకు అవకాశం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దోమలు, ఈగలు పెరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కాలువలను బాగు చేయాలని కోరారు.

– సారవకోట

డంపింగ్ యార్డ్‌లా మార్కెట్



హిరమండలం మేజర్ పంచాయతీలో కొన్నేళ్ల కిందట మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటుచేశారు. ప్రజల నిత్యావసరాలు, కాయగూరలు కొనుగోలు చేసే విధంగా 50 సెంట్ల విస్తీర్ణంలో ప్రత్యేకంగా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక డంపింగ్ యార్డును తలపిస్తోంది. చిన్నపాటి వర్షాలు పడడంతో ప్రస్తుతం అక్కడ నుంచి దుర్వాసన వస్తోంది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన దుకాణాలు వృథాగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

– హిరమండలం

ఆశాజనకంగా అపరాల సాగు



ఈ చిత్రం ఎల్‌.ఎన్‌.పేట మండలం బొత్తాడసింగి ప్రాంతంలో పచ్చగా ఉన్న పెసర పంట. ఈ ఏడాది రబీలో సాగు చేస్తున్న ఆరుతడి పంటల్లో ప్రధానమైన పెసర, మినుము సాగు ఆశాజనకంగా ఉంది. విత్తనాలు వేసినప్పటి నుంచి ఇప్పటివరకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. గత నెలలో కురిసిన వర్షాల తరువాత పంటలు బాగున్నాయి. మండలంలోని సుమారు 4,500 ఎకరాల్లో అపరాల పంటలు సాగు చేస్తున్నారని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు.

– ఎల్‌.ఎన్‌.పేట

పార్కింగ్ సమస్య



ఈ చిత్రం పాతపట్నం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో జాతీయ రహదారిపై పెట్టిన ద్విచక్ర వాహనాలు. పాతపట్నంలో కల్యాణ మండపాలు, బ్యాంకులు, బహుళ అంతస్థుల భవనాలు పెరిగిపోతున్నాయి. అనుమతుల మంజూరు సమయంలోనే లొసుగులు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. పార్కింగ్‌కు యాజమాన్యలు స్థలం వదలడం లేదు. వాహనాలను జాతీయ రహదారిపైనే పార్కింగ్ చేసేస్తున్నారు. ప్రజలతోపాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

– పాతపట్నం

జన జాతర..



జలుమూరు: పూజలు అందుకుంటున్న ముఖలింగేశ్వరుడు



నరసన్నపేట: భక్తులతో కిటకిటలాడుతున్న యాత్ర పరిసరాలు

నరసన్నపేట: మండలంలోని శ్రీరాంపాడు (హేలహలేశ్వర) యాత్రకు భక్తులు పోటెత్తారు. మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మండలంలోని రెడ్డికిపేట-అంప్లాం మధ్య బసివలస రోడ్డుకు ఆనుకుని మల్లికార్జునస్వామి ప్రాంగణంలో ఏటా మాదిరిగానే గురువారం యాత్ర జరిగింది. భక్తులు అధికంగా తరలిరావడంతో యాత్ర ప్రాంగణం కిటకిటలాడింది.

రాణాలో ముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: రాణాలో ముఖలింగేశ్వరుడిని ముక్కనమ సందర్భంగా తిరువీధి ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వరులను జాతర స్థలం వద్దకు మధ్యాహ్నం మూడు గంటలకు తెచ్చారు. నంది వాహనంపై తిరువీధి ప్రారంభించారు. స్వామివారికి తర్ర కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకామేశ్వర జాతర

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురంలో ఉమాకామేశ్వర స్వామి రథయాత్ర గురువారం అంగరంగా వైభంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై ఏర్పాటుచేసి వీధుల్లో ఊరేగించారు. స్వామివారి దర్శనాలు అనంతరం జాతర ప్రారంభించారు. జాతరలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్‌.ఎన్‌.పేట, జలుమూరు మండలాలకు చెందిన భక్తులు అధికంగా పాల్గొన్నారు. పండగకు అత్తవారింటికి వచ్చిన నూతన దంపతులు జాతరలో అధికంగా పాల్గొని సరదాగా గడిపారు. జాతర ఏర్పాట్లను ఆలయ అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ పర్యవేక్షించారు.



నరసన్నపేట: హేలహలేశ్వర యాత్రకు తరలివచ్చిన జన సందోహం



సరుబుజ్జిలి: ఉమాకామేశ్వర జాతరలో పాల్గొన్న భక్తులు



జలుమూరు: జాతరకు విచ్చేసిన భక్తజనం

ప్రయాణ కష్టాలు..



పాతపట్నం కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పాతపట్నం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. సంక్రాంతి, కనుమ తరువాత సుదూర ప్రాంతాలకు తిరిగి వెళ్లడంతో గురువారం రద్దీ మరింత పెరిగింది. గ్రామాలకు చేరేందుకు సకాలంలో ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడ్డారు. బస్ షెల్టర్లు, కాంప్లెక్స్‌ల్లో పడిగాపులు కాశారు. కొందరు అధిక డబ్బులు చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. వివిధ ప్రాంతాల నుంచి పాతపట్నం కాంప్లెక్స్‌కు ప్రతీరోజు 30 నుంచి 40 వరకు బస్సు సర్వీసులున్నాయి. పాతపట్నం నుంచి శ్రీకాకుళానికి 20 నిమిషాలకు ఒక ఆర్టీసీ సర్వీస్ ఉండేది. గురువారం ఉదయం నుంచి బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ బస్సులు ఒకేసారి రెండు, మూడు శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు పాతపట్నం కాంప్లెక్స్‌లో కనిపించాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, టెక్కలి, పలాస, పాలకొండ, ఒడిశాకు చెందిన బస్సులు వచ్చేవి. వీటితోపాటు ప్రైవేట్ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతీరోజు తిరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా దూరపు రూట్లకు బస్సులు వేయడంతో పాతపట్నం ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. ప్రైవేట్ బస్సుల హవా కనిపిస్తోంది.

నిర్మాణాలను అడ్డుకోవాలి

- ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి
- వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలోని రిజర్వ్ స్థలంలో చేపట్టిన నిర్మాణాల విషయం టెక్కలి ఆర్డీఓ పరిధిలో ఉన్నప్పటికీ టీడీపీకి చెందిన నేతలు యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు గురువారం తెలిపారు.

రూ.లక్షలు విలువ చేసిన ఈ స్థలాన్ని 305-ఏ నంబర్‌తో తప్పుడు పట్టాను సృష్టించి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఈ నిర్మాణాలపై పంచాయతీ మెంబర్‌తోపాటు పలువురు పలుసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నిర్మాణాలపై విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.



రిజర్వ్ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు